క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయమందిస్తున్న ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: మండలంలోని వేటుకూరు గ్రామంలో ఈ నెల 19న జరిగిన అగ్ని ప్రమాదంలోఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితుడు డొక్కులూరి హేమంత్ కుమార్ కుటుంబానికి సర్పంచ్ కొండ జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు శనివారం పరామర్శించారు. వారికి ఐదు వేలు రుపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆత్మీయ సమావేశం

సీలేరు: స్థానిక గుంటవాడ జలాశయం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ్యులంతా వనభోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.

కళాశాలలో స్వచ్ఛభారత్

సీలేరు: స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ పీవో డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్త చెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించి, పరిశుభ్రంగా ఉంచారు. ప్రిన్సిపాల్ శంకరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంతలో తనిఖీలు



దుకాణదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం: వారపు సంతను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం తనిఖీ చేశారు. వచ్చే వారం నుంచి అన్ని దుకాణాలు మార్కెట్లోని షెడ్లలో ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులను ఆదేశించారు. సంతలో విక్రయించే వస్తువులు, తినుబండారాలను మండలస్థాయి అధికారులతో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది తనిఖీలు చేయాలని సూచించారు. తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావు, ఏపీవో ప్రకాశ్ తదితరులున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ నాగరాజు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ డి.గరుడాపల్లిలో మట్టిరోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజులు శనివారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రహదారి సమస్యలు కలిగిన గ్రామాలను గుర్తించి పంచాయతీ నిధులతో రోడ్లు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. గరుడాపల్లో మట్టి రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.1.50లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై కౌన్సెలింగ్

గూడెంకొత్తవీధి: ఒకే కుటుంబానికి చెందిన అన్నా, చెల్లెలు ఇద్దరు భూ వివాదంపై తరచూ గొడవలు పడడంతో ఇద్దరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తహసీల్దార్ రామకృష్ణ శనివారం తెలిపారు. గూడెంకొత్తవీధికి చెందిన ముక్కలి వాసుదేవరావు, సురకత్తి కనకమహాలక్ష్మిలు భూ వివాదంపై తరచూ ఘర్షణలకు దిగుతున్నారన్నారు.ఇద్దరు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ముందస్తుగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేశామన్నారు. భూ వివాదాన్ని మ్యుటేషన్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని సూచించామన్నారు. ఇద్దరూ గొడవలు, కొట్లాటకు దిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ హెచ్చరించారు



వారపు సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన స్వెట్టర్లు



సంతలో మంకీ క్యాపులు, జర్కిన్లు

వెచ్చని నేస్తాలు

- మన్యంలో విజృంభిస్తున్న చలి
- రగ్గులు, స్వెట్టర్లు, జర్కిన్‌లకు గిరాకీ
- వారపు సంతల్లో జోరుగా వ్యాపారం
- భారీగా కొనుగోలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లాలో చలి తీవ్రత మొదలు కావడంతో గిరిజనులను గజగజ వణికిస్తోంది. ఉదయం 9గంటలైనా మంచు తెరలు వీడడం లేదు. సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలవుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. బయటకు వచ్చేందుకు గిరిజనులు భయపడుతున్నారు. ఉదయం బడికి వెళ్లేందుకు చిన్నారులు అవస్థలు పడుతున్నారు. దీంతో చలి నుంచి రక్షణ పొందేందుకు గిరిజనులు రగ్గులు, స్వెట్టర్లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. వారపు సంతల్లో ప్రస్తుతం ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. సంతల్లో వివిధ రకాల డిజైన్లలో చలి నుంచి రక్షణ ఇచ్చే దుస్తులు ఆకర్షణీయమైన రంగులతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలో ముంచంగిపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట వారపు సంతల్లో స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజులు, శాలువాలు, టోపీలు, నోస్‌మాస్కులు, స్కార్ఫ్‌లు, జర్కినిలు, రగ్గులు దుకాణాలు ఏర్పాటు చేశారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారాలు అమ్మకాలు సాగిస్తున్నారు. ధరలు ఓ మోస్తరుగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. చలిలో ఎటువంటి రక్షణ లేకుండా బయటకు వెళ్లొద్దని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలంటున్నారు. బయటకు వచ్చినపుడు వృద్ధులు, చిన్నారులు తప్పనిసరిగా స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, టోపీలు ధరించాలని సూచిస్తున్నారు.

ధరలు ఇవీ..

పిల్లల స్వెట్టర్లు రూ.250 నుంచి రూ.600 , పెద్దల స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.1500, శాలువాలు రూ.100 నుంచి రూ.500, స్కార్ఫ్‌లు రూ.50 నుంచి రూ.150, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి రూ.200, బ్లాంకెట్లు రూ.300 నుంచి రూ.500, గ్లౌజులు రూ.100 నుంచి రూ.150, రగ్గులు రూ.600 నుంచి రూ.3000 వరకు ధరలకు అమ్ముతున్నారు. చలి పెరగడంతో వ్యాపారం జోరుగా సాగుతుందని, గతంతో పోలిస్తే వ్యాపారం లాభసాటిగా ఉందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ముంచంగిపుట్టు సంతలో కొనుగోలు చేస్తున్న గిరిజనులు

అందుబాటులో ధరలు



సంతల్లో అమ్ముతున్న స్వెట్టర్లు, జర్కెనిలు, మంకీ క్యాప్‌ల ధరలు అందరికీ అందుబాటు ఉన్నాయి. మంచి రంగులు, డిజైన్లలో లభ్యమవుతున్నాయి. చలి నుంచి రక్షణకు మంచిగా ఉపయోగపడుతున్నాయి.ఈ ఏడాది చలి చాలా ఎక్కువగా ఉంది.

– జి.రాజు, గిరిజనుడు, పాతముంచంగిపుట్టు గ్రామం

వ్యాపారం బాగుంది



చలి పెరగడం వారపు సంతల్లో వ్యాపారం జోరుగా సాగుతుంది.అన్ని రకాల డిజైన్‌లతో దుస్తులు ఉన్నాయి.వినియోగదారులను ఆకట్టుకునేందుకు కాస్తంత తక్కువ ధరలతో నాణ్యమైన వ్యాపారం చేస్తున్నాం.గతంతో పోలిస్తే ఈ ఏడాది చలి కాలం ప్రారంభంలోనే వ్యాపారం లాభసాటిగా ఉంది.

–ఎండి.హమీద్, వ్యాపారి, జోలాపుట్టు గ్రామం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ

కూనవరం: మండలంలోని చూచిరేవుల గూడెంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన తెల్లం ముత్తయ్య కుటుంబానికి ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ రూ.10,000 వేలు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు అరవా వెంకట్రామారావు రూ.2000, దీకొండ గంగాధర్ రూ.500, భరతమూర్తి రూ.500, నందికొండ నర్సింహారావు రూ.500, కొమ్మాని వీర్రాజు, సునీతలు బియ్యం, పప్పులు, దుస్తులను పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, సర్పంచ్ తెల్లం నిరోషా, రాష్ట్ర నాయకుడు ఆవుల మరియాదాస్, నాయకులు గుజ్జా బాబు, కొమ్మాని మోహన్‌రావు, ఎస్.సత్యనారాయణ, సత్తిపండు, లక్ష్మణరావు, ఎలిపె రమేష్, బి.వెంకటేష్, జి.రమేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వితరణ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు

గంగవరం: సత్యసాయి బాబా జన్మదినోత్సవాన్ని మండల కేంద్రమైన గంగవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వాడపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం ఆవరణలో ఈ వేడుక జరిగింది.

యూటీఎఫ్ కార్యవర్గానికి అభినందనలు

గంగవరం :యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గానికి పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా రఘుబాబు, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలుగా రుక్మిణీదేవి , అసోసియేట్ అధ్యక్షుడిగా బొజ్జిదొర , కోశాధికారిగా సత్యకిరణ్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

సీలేరు: దుప్పులవాడ పంచాయతీ పరిధిలోలో కాట్రగెడ్డ , ఎస్.నేరేడుపల్లి, పిల్లిగెడ్డ, జొన్నమామిడి తదితర గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ఎస్.కె.మస్తాన్ వలీ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల వివిధ పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వలన చలిగాలులు వీస్తున్నాయని, రగ్గులు, స్వెట్టర్లు ధరించాలని చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ త్రినాధరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధి పనులపై గ్రామసభ

ముంచంగిపుట్టు: మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై గ్రామ సభను శనివారం సర్పంచ్ సిరగం నరసింగరావు అధ్యక్షతన సోషల్ ఆడిట్ సిబ్బంది నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై పంచాయతీలో 19 గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు నాలుగు రోజులుగా తనిఖీ చేసి, గుర్తించిన సమస్యలపై గ్రామ సభలో చర్చించారు. జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులుపై సభలో ఆడిట్ అధికారులు వివరాలను తెలియజేశారు. వీటిపై ప్రజల సమక్షంలో చర్చించారు. ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మి, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, ఎస్ఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

అందుబాటులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

గూడెంకొత్తవీధి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన 135 మంది ఓటర్ల ముసాయిదా జాబితాను నమోదు చేసినట్టు తహసీల్దార్ రామకృష్ణ శనివారం తెలిపారు. ఆయన జాబితాను కార్యాలయం ఆవరణలో అతికించారు. ఆయన మాట్లాడుతూ జాబితా అందుబాటులో ఉంచామన్నారు. వచ్చే నెల తొమ్మిది వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీటీ సీతారాం, సీనియర్ సహాయకులు చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.

అడ్డతీగల: తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రులు నియోజకవర్గ ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్‌ని విడుదల చేసినట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. క్లెయిములు అభ్యంతరాలను దాఖలు చేయడానికి డిసెంబర్ 9 వరకూ గడువు ఉందన్నారు. ఎన్నికలకు సంబంధించి మరింత సమాచారం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలన్నారు.



జీకే వీధిలో జాబితాను ప్రదర్శిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, డీటీ సీతారాం

కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను ఎండగట్టాలి

- 26న ధర్నాకు తరలిరండి
- ఆల్ ఇండియా సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బేబీరాణి



మాట్లాడుతున్న ఆల్ ఇండియా సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బేబీరాణి

అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు చర్యలను ఎండగట్టడానికి ఈనెల 26 న రంపచోడవరం ఐటీడీఏ ఎదుట చేపట్టనున్న మహాధర్నాకి అన్ని ప్రజా సంఘాలు తరలిరావాలని ఆల్ ఇండియా సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బేబీరాణి పిలుపునిచ్చారు.స్థానిక ఎంఆర్‌సీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు దిగిరావాలన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల పొట్ట కొట్టవద్దన్నారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, మిడ్ డే మీల్ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల కనీస వేతనాలు పెంచాలన్నారు. అధికారులు అంగన్‌వాడీ వర్కర్ల పట్ల వైఖరి మార్చుకోవాలన్నారు. నేతలు నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: ఆదానీ గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అవినీతి రాకాసి బొమ్మతో నిరసన ర్యాలీను శనివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సెకీ నుంచి రాష్ట్ర డిస్కమ్‌కు విద్యుత్ కొనుగోలుకు ఆదానీ గ్రూప్ భారీగా ముడుపులు చెల్లించిందని దీనిపై విచారణ జరిపించాలన్నారు. ఆదానీ గ్రూపునకు కేటాయించిన భూములన్నీ వెనక్కి తీసుకోవాలన్నారు. ధర్మన్నపడాల్, జీవన్, కార్తీక్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ఆందోళన

ముంచంగిపుట్టు: మండలంలో గల మాకవరం పంచాయతీ ఛతాం గ్రామస్తులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ తదితరులు తహసీల్దార్ నర్సమ్మకు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఆధార్, రేషన్ కార్డులు లేక గ్రామస్తులకు పథకాలు అందడం లేదన్నారు. అడవీ ప్రాంతంలో ఆయా ఆదివాసీలు జీవిస్తున్నారని, గ్రామానికి సరైన రహదారి లేదని, తాగునీటి పథకాలు, బడి, అంగన్‌వాడీ వంటి ఎటువంటి సౌకర్యాలకు నోచుకోక జీవనం సాగిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించి, స్థానికులకు ఆధార్, రేషన్‌కార్డులు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. శ్రీను, భీమరాజు, జీనబంధు, నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అడ్డతీగల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో శనివారం రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఆమెకు పలు సూచనలు చేశారు. అధికార కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకు తెలియజేసి, ప్రచారం చేయాలన్నారు. అధికార పార్టీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టాలని వైఎస్ జగన్ సూచించారు. పార్టీ శ్రేణులపై ఎటువంటి వేధింపులు జరిగినా వారికి అండగా ఉండాలని చెప్పారు.



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గృహాల నిర్మాణాలు వేగవంతం

ముంచంగిపుట్టు: పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ వంతినిభ రాంబాబు అన్నారు. మండలంలోని జర్జుల పంచాయతీ సింధిపుట్టు గ్రామంలో శనివారం పీఎం జన్‌మన్ గృహాలపై గ్రౌండింగ్ మేళాను ఆయన ప్రారంభించారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా నిర్మించే గృహాలపై పీవీటీజీ గిరిజనులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ గృహాలు వేగంగా నిర్మించుకుంటే త్వరితగతిన బిల్లులు మంజూరు చేస్తామని, గృహాల నిర్మాణాల విషయంలో జ్యాపం చేయవద్దని, ఇప్పటికే కొంతమందికి వ్యక్తిగత ఖాతాలలో బిల్లులు జమ అయినట్టు చెప్పారు. గృహాల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు హౌసింగ్ సిబ్బంది పర్యవేక్షిస్తారని, బిల్లులను సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. హౌసింగ్ ఏఈ సీహెచ్.కృష్ణారావు, ఉపసర్పంచ్ సాధురాం, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిందిపుట్టులో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ రాంబాబు

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చలపతి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన కళాశాల భవనం ఆవరణలో తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటామన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి రానున్న రోజుల్లో కళాశాలను నందనవనంలా తీర్చిదిద్దాలన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి దాతలు తమ వంత సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్.మూర్తి, దండకారణ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీను బాబు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు మయూరి రాజు, అధ్యాపకులు ధర్మారావు, భలరామ్, లక్ష్మీ, స్వర్ణలత, ప్రసాద్, దివ్య మౌనిక, అన్నపూర్ణ, ప్రణీత, విద్యార్థినులు పాల్గొన్నారు.



మొక్కలతో ప్రిన్సిపాల్ చలపతి, తదితరులు

వరికుప్ప దగ్ధం

హుకుంపేట: వరి కుప్ప కాలి బూడిదైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని పాతకోట బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన గిరిజన రైతు కొర్ర పండన్నకు చెందిన వరి కుప్ప అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. గత వారం రోజులు నుంచి వరి పంటను కోసి పొలంలో కుప్పగా వేశారు. శనివారం చిన్నపిల్లలు కుప్పల వద్ద ఆడుకోవటాన్ని పలువురు గమనించారు. అనంతరం ఒక్కసారిగా వరి కుప్ప దగ్ధమైనట్టు గుర్తించారు. ఏ విధంగా కుప్ప దగ్ధమైందో తెలియక రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నాణ్యమైన ధాన్యం పండించామని సుమారు రూ.50వేలు విలువ ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, పలువురు కోరుతున్నారు.



బొడ్డాపుట్టులో కాలి బూడిదైన వరి కుప్ప

పాడేరు, అరకు ఎమ్మెల్యేల పరామర్శ



సర్పంచ్ రాంబాబును పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అశ్వినిని పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

పాడేరు : అనారోగ్యానికి గురై స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కించూరు పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంతాల రాంబాబును శనివారం ఉదయం పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సలు కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. త్వరగా కోలుకోవాలని, పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, గబ్బంగి సర్పంచ్ గొల్లోరి నీలకంఠం, తదితరులున్నారు.

అరకు ఎమ్మెల్యే పరామర్శ

మహారాణిపేట: హుకుంపేట మండలం తడేపుట్టు గ్రామానికి చెందిన అశ్విని కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విశాఖలోని కేజీహెచ్‌ను సందర్శించి, రోగిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే ఆమె యోగక్షేమాలను అడిగి తెలుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను సూచించారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

పాడేరు : రాష్ట్రంలోని గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఐటీడీఏ ఎదుట గిరిజన గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపడుతున్న రిలే దీక్షలు శనివారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ రిలే దీక్ష శిబిరాన్ని ఏపీటీఎఫ్ తరపున ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ సందర్శించి వారికి మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన చేస్తున్నప్పటికీ, వీరికి పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు.సమస్యలు పరిష్కరించేంత వరకు తాము అండగా ఉంటామని చెప్పారు. దీక్షలకు దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం మాట్లాడుతూ గిరిజన గురుకుల ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వడం లేదన్నారు.
వారు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్రా ధనుర్జాయ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యామ్ సుందర్, జిల్లా కార్యదర్శి శాంతికుమారి, ప్రభకర్‌రావు, సత్యారావు తదితరులు తమ సంఘీభావాన్ని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

హుకుంపేట: పాడేరు–అరుకు ప్రధాన జాతీయ రహదారి కొట్నాపల్లి గ్రామ సమీపంలో మలుపు వద్ద శనివారం ఉదయం అరకు అందాలు చూసేందుకు వచ్చిన పర్యాటకుడి కారు ప్రమాదానికి గురైంది. పాడేరు నుంచి అరుకు వైపు వెళ్తుండగా మంచు అధికంగా ఉండడంతో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోపల ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. త్రుటిలో ప్రమాదం తప్పినట్టు స్థానికులు తెలిపారు.



కొట్నాపల్లిలో డివైడర్‌పై ఎక్కిన కారు